# అధిక దిగుబడికి నారుమడి కీలకం

నర్సింహులపేట, డిసెంబర్ 7 : వరిలో అధిక దిగుబడి సాధించాలంటే ఆరోగ్యవంతమైన నారుమడి కీలకం.. పిల్ల దశలో ఆరోగ్యంగా లేని నారు వేయడం వల్ల పంటకు తెగుళ్లు, పురుగుల వ్యాప్తి అధికంగా ఉంటుంది. దీనితో రైతు అధికంగా నష్టపోయే అవకాశం ఉంది. రైతులు సాధారణంగా ఎంతవరకు ఏ రకం విత్తనాలు వేస్తే అధిక దిగుబడి వస్తుందో దానిపైనే దృష్టి పెడుతారు. కానీ నారుమడిలో జాగ్రతలు తీసుకుంటే మంచి ఫలితాలు వస్తాయని వ్యవసాధికారులు సూచిస్తున్నారు.



నారుమడి తయారు చేస్తున్న రైతు

**విత్తన శుద్ధిలో పాటించాల్సిన జాగ్రతలు..**

కిలో విత్తనానికి 2.5 గ్రాముల కార్బండజిమ్ కలిపి 24 గంటల తర్వాత నారుమడిలో చల్లుకోవాలి. నారుమళ్ల కైతే లీటరు నీటికి 1 గ్రాము కార్బండజిమ్ కలిపి, ఆ ద్రావణంలో విత్తనాలను 24 గంటలు నానబెట్టి, 24 గంటలు మండెకట్టి మొలకలను నారుమడిలో చల్లుకోవాలి.

కిలో విత్తనాలు నానబెట్టడానికి పది లీటర్ల నీటికి 1.5 కిలోల ఉప్పు కలుపగా వచ్చిన ద్రవంలో ఎంపిక చేసుకున్న విత్తనాన్ని పోసి పైకి తేలిన తాలు విత్తనాలను తీసివేయాలి. ఉప్పునీటిలో మునిగిన గట్టి విత్తనాలను నారు పోయడానికి వాడుకోవాలి. మడిలో చల్లే ముందు 24 గంటల పాటు మంచినీటిలో విత్తనాలను నానబెట్టాలి. విత్తనాల ద్వారా సంక్రమించే తెగుళ్ల నివారణ కోసం కిలో విత్తనానికి 3 గ్రా. థైరమ్ లేదా కాప్టాన్ మందును కలిపి విత్తన శుద్ధి చేయాలి. నారుమడిలో చల్లే ముందు మొలకెత్తిన విత్తనాన్ని 0.2 శాతం క్లోరిఫైరిఫాస్ ద్రావణంలో నానబెట్టి చల్లుకోవాలి. దీని వల్ల నారుమడిలో ఆకు తినే పురుగులు, ఉల్లికోడు, మొవ్వ పురుగు ఆశించకుండా ఉంటాయి.

**నాటు వేసే పొలంలో భూసారం..**

నారుమడి చేసేముందు పొలంలో ఎకరానికి 2 నుంచి 5 టన్నుల వరకు పశువుల ఎరువులను వేసుకోవాలి. లేదా వర్మీ కంపోస్టు, లేదా ఇతర ఎరువులను పొలం మొత్తం చల్లుకోవాలి. తర్వాత పొలంలో తగిన నీరు 5–10 సెంటిమీటర్లు నీళ్లు పెట్టి బాగా కలియ దున్నాలి. తరువాత మట్టిగడ్డలన్నీ మెత్తగయ్యేలా దమ్ము చేయాలి. తర్వాత పొలం నుంచి కలుపు మొక్కలు లేకుండా జాగ్రత్త తీసుకోవాలి.

**నారు కొసలు తుంచాలి**

పురుగులు గుడ్డును నారు కొసల మీద పెడుతుంది కాబట్టి నాటేటప్పుడు నారు కొసలు విరిచి నాటాలి. 5 సెంట్ల నారుమడిని 2 కిలోలు నత్రజని 1 కిలో విత్తనం చల్లే ముందు, 1 కిలో భాస్వరం, 1 కిలో పొటాష్ నిచ్చే ఎరువులను దుక్కిలో వేయాలి. చలి ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో భాస్వరం రెట్టింపు వేయాలి. మొలక కట్టిన విత్తనాన్ని సెంటుకు 5 కిలోల చొప్పున చల్లుకోవాలి. నారు పూర్తిగా పురివిచ్చుకునే వరకు ఆరు తడుల తర్వాత పలుచగా నీరు పెట్టాలి. జింకు లోపం కనిపిస్తే లీటరు నీటికి 2 గ్రాముల జింకు ద్రావణాన్ని పిచికారీ చేయాలి. చలి ఎక్కువగా ఉంటే వరి సాగులో జింకు లోప లక్షణాలు కనిపిస్తాయి. విత్తిన 10 రోజులకు కార్బోఫ్యూరాన్ 3 జీ గుళికలు సెంటు నారుమడికి 160 గ్రాముల చొప్పున వేయాలి. లేదా మోనోక్రోటోఫాస్ 1.6 మిల్లీలీటర్లు లేక క్రోరిఫైరిఫాస్ 2.0 మి.లీ. నీటిని కలిపి విత్తిన 10, 17 రోజులకు పిచికారీ చేయాలి.



**రామకృష్ణ, ఇన్‌చార్జి ఏవో**

## కుమ్మరికుంట్ల ఆరోగ్య ఉప కేంద్రం తనిఖీ

దంతాలపల్లి, డిసెంబర్ 7 : మండలంలోని కుమ్మరికుంట్లలోని ఆరోగ్య ఉప కేంద్రాన్ని గురువారం సీహెచ్‌వో బాలాజీ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సెంటర్‌కు సంబంధించిన రిజిస్టర్లను పరిశీలించారు. ఏఎన్ఎంలు, ఆశవర్కర్లు సబ్ సెంటర్‌లో అందుబాటులో ఉంటూ గర్భిణులకు ఆరోగ్య రక్షణపై సలహాలు, సూచనలు అందించాలన్నారు. పిల్లలకు అందించే టీకాలు 100 శాతం పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ మహేశ్వరి, ఏఎన్‌ఎంలు సుభద్ర, అనూష, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.



రిజిస్టర్లను పరిశీలిస్తున్న సీహెచ్‌వో బాలాజీ

## ప్రజా తీర్పును శిరసావహిస్తాం

కురవి, డిసెంబర్ 7 : అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పును శిరసావహిస్తామని జడ్పీటీసీ బండి వెంకట్‌రెడ్డి అన్నారు. గురువారం గుండ్రాతి మడుగు తన నివాసంలో సర్పంచ్‌లు, బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తలతో జడ్పీటీసీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రతి పక్షంలో ఉన్నా ప్రజలకు సేవ చేయడానికి అందుబాటులో ఉంటామన్నారు. బీఆర్ఎస్ ప్రజా ప్రతినిధులు, నాయకులు అధైర్య పడవద్దన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నరహరి గౌడ్, బాదె నాగన్న, కిశోర్ వర్మ, హచ్యా నాయక్, బసవ కొమురయ్య, అర్జున్ చౌహాన్, జానీమియా, ఉపేందర్, సర్పంచ్‌లు గుగులోత్ నెహ్రూ, బోడ శ్రీను, భద్రూ నాయక్, హరి ప్రసాద్, వినోద్, కిషన్, జీవన్ పాల్గొన్నారు.



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీటీసీ బండి వెంకట్‌రెడ్డి

# నిండా ముంచిన మిగ్‌జాం తుఫాన్

తొర్రూరు, డిసెంబర్ 7 : మిగ్‌జాం తుఫాను ప్రభావంతో మండలంలో వందలాది ఎకరాల వరి, పత్తి, మిరప, ఇతర పంటలకు నష్టం వాటిల్లింది. పంటలను కాపాడుకునేందుకు రైతులు నానా కష్టాలు పడుతున్నారు. ధాన్యపు రాసులు తడిసి ముద్దయ్యాయి. రంగు మారిన ధాన్యాన్ని ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర ప్రకారం కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు. వానకాలం వరి కోతలు సగమే పూర్తయ్యాయి. ఇంకా ఆయా గ్రామాల్లో కోతలు కొనసాగుతున్నాయి. వరి కోత, నూర్పిడి దశలో ఉంది. పలు ప్రాంతాల్లో ధాన్యం కల్లాల్లో ఆరబెడుతున్నారు. కోత దశలో ఉన్న వరి ఈదురుగాలులకు నేలవాలుతోంది. నేల వాలిన కంకులు తేమ కారణంగా మొలకొచ్చే ప్రమాదం ఉంది. నేలవాలిన వరిని యంత్రాలు కోయటం అంతగా సాధ్యం కాదు. కూలీలతో వరికోతలు జరిపించాల్సి ఉంటుంది. దీంతో రైతులకు ఖర్చులు మరింతగా పెరిగే అవకాశం ఉంది. తేమతో ఉన్న ధాన్యం రాశులు నాణ్యత కోల్పోతాయని రైతులు దిగులు చెందుతున్నారు. మండలంలోని సోమవరపుకుంట తండాలో సుమారు 50 ఎకరాల చేతికొచ్చే వరి పంట తుఫాన్‌తో నేల పాలైంది. దానిపై వ్యవసాయ అధికారులు అంచనా వేస్తున్నారు.

**చిన్నగూడూరులో..**

చిన్నగూడూరు : తుఫాన్ రైతులకు తీవ్ర నష్టాన్ని మిగిల్చింది. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో కల్లాల్లో ఆరబెట్టిన ధాన్యం తడిసి ముద్దయింది. టార్పాలిన్లు, పట్టాలు కప్పినా ధాన్యం తడిసింది. మరి కొందరి రైతుల వరి ఈదురుగాలులకు నేల వాలి మొలకలు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పత్తి, మిర్చితో పాటు వరి పంటలు తీవ్రంగా నష్టపోయినట్లు తెలుపుతున్నారు. ఆరుకాలం కష్టపడి వారం రోజుల్లో చేతికంది వస్తుందనుకునే సమయంలో ఇలా జరిగిందేంటానని కన్నీటి పర్యంతం అవుతున్నారు. మం డలంలోని పలు గ్రామాల్లో కోసిన వరి మెదలు నీట మునిగాయి. అధికారులు ఇప్పటి వరకు రాలేదని ఆరోపించారు. మండలంలో పర్యటించి పం ట నష్టాన్ని అంచనా వేసి పరిహారం అందించాలని కోరారు.

**బయ్యారంలో..**

బయ్యారం : తుఫాన్ కారణంగా తడిసిన పంటలను కాపాడుకునేందుకు రైతులు తిప్పలు పడుతున్నారు. మండంలోని పలు గ్రామాల్లో వర్షం కారణంగా వరి, మక్కజొన్న వంటి పంటలు తడిశాయి. వాటిని ఆరబోసి పడిగాపులు పడుతున్నారు. మళ్లీ వర్షం వస్తుందేమోనని రైతులు ఆందోళన చెందుతున్నారు.



తొర్రూరు : గాలివానకు నేలకు వాలిన వరి పంట



చిన్నగూడూరు : వర్షపు నీటితో తడిసిన వరి మెదలను చూపుతున్న రైతు



నవీన్‌రావుకు మెమెంటోను అందిస్తున్న పాలక మండలి సభ్యులు

## గ్రంథాలయ అభివృద్ధి చరిత్రలో నిలిచిపోతుంది..

మహబూబాబాద్ రూరల్, డిసెంబర్ 7 : బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జిల్లా గ్రంథాలయ అభివృద్ధి చరిత్రలో నిలిచిపోతుందని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గుడిపూడి నవీన్‌రావు అన్నారు. గురువారం పట్టణ కేంద్రంలోని గ్రంథాలయంలో పాలక మండలి సభ్యులకు వీడ్కోలు సభ నిర్వహించి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్న రేకులు, పెంకిటింట్లో ఉన్న గ్రంథాలయం నూతన హంగులతో నిర్మించి, విద్యార్థులకు సకల సౌకర్యాలు కల్పించామన్నారు. మారిన రాజకీయ పరిణామాల వల్ల రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి తూర్పాటి శ్రీలత, మండలి సభ్యులు పెద్ది సైదులు, నిమ్మల శ్రీనివాస్, ఉమా, లైబ్రేరియన్ రవి, విజేందర్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్థిక సాయం అందజేత

మరిపెడ, డిసెంబర్ 7: మండలంలోని ఎల్లంపేట జడ్పీ పాఠశాలలో 1992–93 విద్యా సంవత్సరం వరకు కలిసి చదువుకున్న పది విద్యార్థులు తమ స్నేహితుడైన ఉప్పోజు వెంకటచారి సతీమణి వసంత ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. బాధిత కుటుంబానికి పూర్వ విద్యార్థులు గురువారం పరామర్శించారు. వారికి రూ.10వేల ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో రైతుబంధు జిల్లా సభ్యులు జర్పుల కాలూనాయక్, జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు లింగంపల్లి దయానంద్, నడిగోటి శ్రీశైలం, మక్క అంజన్న, కంచనపల్లి ఉపేందర్, గండి పరమేశ్, లక్ష్మయ్య, అశోక్, వీరన్న, మల్లయ్య, హుస్సేన్, యశోద, పాపారావు తదితరులు పాల్గొన్నారు.



బాధిత కుటుంబానికి చెక్కు అందిస్తున్న పూర్వ విద్యార్థులు

## రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్రగాయాలు

డోర్నకల్, డిసెంబర్ 7 : రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలైన ఘటన డోర్నకల్ పెట్రోల్ బంక్ వద్ద గురువారం రాత్రి చోటు చేసుకున్నది. సీరోలు మండలం కాంపెల్లి గ్రామానికి చెందిన ముత్తమ్మ, శిల్ప, శ్రీరాములు ఆటోలో అడవిమద్దిలపల్లి నుంచి వస్తుండగా డోర్నకల్ పెట్రోల్ బంక్ వద్ద కుక్క అడ్డు రావడంతో ఆటో బోల్తా పడింది. గాయపడినవారిని 108 వాహనంలో మహబూబాబాద్ ఏరియా దవాఖానకు తరలించారు.

**ఖానాపురంలో..**

ఖానాపురం, డిసెంబర్ 7 : రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలైన ఘటన మండలకేంద్రం శివారు పెట్రోల్ బంకు సమీపంలో గురువారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. ఖమ్మం పట్టణానికి చెందిన సాయితేజ, స్టెల్లా వ్యక్తిగత పనిపై కారులో వరంగల్‌కు వెళ్తున్నారు. ఖానాపురం శివారు పెట్రోల్ బంకు సమీపంలోకి రాగానే రెడ్డిరంగారెడ్డి గార్డెన్స్ నుంచి ఖానాపురానికి చెందిన వీరస్వామి మోపైడ్‌పై మండలకేంద్రం వస్తుండగా, కారు అతి వేగంగా వచ్చి మోపైడ్‌ను, సమీపంలోని చెట్టును ఢీకొని పొలంలో బోల్తాపడింది. మోపైడ్‌పై వస్తున్న వీరస్వామి కాలు విరిగింది. అదృష్టవశాత్తు కారులో బెలూన్లు తెరుచుకోవడంతో సాయితేజ, స్టెల్లా స్వల్ప గాయాలతో బయటపడినారు. వీరస్వామిని ఆటోలో నర్సంపేట ప్రభుత్వ దవాఖానకు తరలించారు.

## వైభవంగా శివలింగ ప్రతిష్ఠాపన

దామెర, డిసెంబర్ 7: వెంకటాపురంలో వేదబ్రాహ్మణుల మంత్రోచ్ఛారణల మధ్య గురువారం శివపంచాయతన ఆలయంలో శివలింగ ప్రతిష్ఠాపనోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అంతకుముందు స్వామివారి గర్భగుడిలో ప్రతిష్ఠించే శివలింగం, ధ్వజస్తంభం, నవగ్రహాలకు వేదపండితులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అశేష భక్తజనం మధ్య శివోహం నామస్మరణతో యంత్ర ప్రతిష్ఠాపన జరిపారు. తర్వాత శివలింగ, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనను కనులపండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా కైలాస దేవుడైన శివుడికి విశేష అభిషేకాలు చేసి, భక్తులు ధూపదీప నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించారు.

## కలెక్టర్‌ను అభినందించిన టీఎన్జీవోస్

ఖిలావరంగల్, డిసెంబర్ 7: అసెంబ్లీ ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించినందుకు వరంగల్ టీఎన్జీవోస్ కార్యవర్గం గురువారం కలెక్టర్ పీ ప్రావీణ్యను మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా ఆమెకు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు గజ్జెల రాంకిషన్, ప్రధాన కార్యదర్శి గాజె వేణుగోపాల్ పాల్గొన్నారు.